
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 35.0 కనిష్ఠం : 26.0
ANDHRAJYOTHY
3



అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 19 మే 2025

జోరుగా ముంగారు సేద్యాలు

'ఈసారి ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు జోరుగా ముంగారు సేద్యాలు చేసుకుంటున్నారు. గత పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ముందస్తుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పుడే సేద్యాలు ముగిస్తే.. జూన్‌లోనే విత్తనం వేసుకోవచ్చని రైతులు సమాయత్తమవుతున్నారు. గతం కంటే ట్రాక్టర్ బాడుగలు పెరిగిపోయాయి. ప్రభుత్వం సరఫరా చేసే సబ్సిడీ విత్తన కాయల కోసం చాలామంది రైతులు ఎదురుచూస్తున్నారు.'

వర్షాల రాకతో రైతుల సన్నద్ధం

- ట్రాక్టర్లకు డిమాండ్
- ఖరీఫ్ సాగుకు సమాయత్తం



గుత్తి మండలం కొత్తపేట వద్ద ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతు

అనంతపురం అర్బన్/ గుత్తి రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఖరీఫ్ దుక్కులు మొదలయ్యాయి. గత కొన్ని రోజులుగా జిల్లాలో వర్షాలు పడుతుండటంతో పొలం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఓ మోస్తరు వర్షం పడిన ప్రాంతాల్లో దుక్కులు జోరందుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు కాగా, మిగిలిన విస్తీర్ణంలో కంది, ఆముదం, పత్తి, అలసంద, పెసలు, పొద్దుతిరుగుడు, ఉలవ, కొర్ర, సజ్జ, రాగి, జొన్న, మొక్కజొన్న తదితర రకాల పంటలు ఉన్నాయి. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ మొదలుకానుంది. సకాలంలో వర్షాలు పడితే విత్తనం వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈసారి ఆశించిన స్థాయిలో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పెరిగిన ట్రాక్టర్ బాడుగలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడటంతో వేసవి దుక్కులకు డిమాండ్ పెరిగింది. ట్రాక్టర్ మడకలు, టిల్లర్‌తో పొలాల్లో దుక్కులు చేసుకుంటున్నారు. ప్రాంతాల వారిగా భూమి స్వభావాన్ని బట్టి బాడుగలను పెంచారు. కొన్ని ప్రాంతాల్లో రెండు, మూడు, ఐదు మడకలతో దుక్కి చేసేందుకు గంటకు రూ.1000 నుంచి రూ.1100, ట్రాక్టర్‌తో ఏడు మడకలకు గంటకు రూ.1200 వసూలు చేస్తున్నారు. డోజర్‌తో గంటకు రెండు, మూడు మడకలకు రూ.1000 నుంచి రూ.1100, ఐదు మడకలకు రూ.1200 వసూలు చేస్తున్నారు. టిల్లరుకు ఎకరాకు రూ.600, గంటకు రూ.1200 బాడుగ నిర్ణయించారు. కాడెద్దులతో చెక్కల గుంటకతో దుక్కి చేసేందుకు ఎకరాకు రూ.500 తీసుకుంటున్నారు.



గుత్తి మండలం జక్కలచెరువులో ట్రాక్టర్‌తో దుక్కులు

సేంద్రియ ఎరువులు చల్లుకుంటున్నా



వర్షాలు పడుతుండడంతో ఖరీఫ్ సీజన్‌కు పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నా. రెండు ఎకరాల్లో దుక్కులు చేయించాను. పొలంలో సేంద్రియ ఎరువులు చల్లుకుంటున్నా. ప్రభుత్వం ఇంకా విత్తనకాయలు సరఫరా చేయలేదు. త్వరగా పంపిణీ చేస్తే విత్తనాలను సిద్ధం చేసుకుంటాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షం పడితే దేవుడిపై భారం వేసి వేరుశనగ విత్తనం వేస్తా.

-రంగప్ప, రైతు, బేతాపల్లి, గుత్తి మండలం

వేసవి దుక్కులు చేసుకున్నా



ఈసారి ముందుగానే వర్షాలు కురుస్తున్నాయి. పదును కావడంతో మూడు ఎకరాల్లో వేసవి దుక్కులు చేసుకున్నా. గత ఏడాదిలాగానే దుక్కులకు బాడుగలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తన కాయల కోసం ఎదురుచూస్తున్నాం. పొలాలను సిద్ధం చేసుకుంటున్నాం. జూన్‌లో సకాలంలో వర్షం పడితే వేరుశన విత్తనం వేసేస్తాం.

- సుధాకర్, రైతు, కొత్తపేట, గుత్తి మండలం

ముందస్తు సేద్యంతో ప్రయోజనాలు

ముందస్తుగా దుక్కులు చేయడం ద్వారా భూమి, పంటలకు చాలా ఉపయోగం. ఎక్కువ శాతం మంది రబీ పంటలు కోయగానే పొలాన్ని అలాగే వదిలేస్తారు. తొలకరి వర్షాలు పడిన సమయంలో ఖరీఫ్‌కు సన్నద్ధమవుతారు. అంతకంటే ముందు వేసవిలోనే దుక్కులు దున్నుకుంటే ప్రయోజనం ఉంటుంది. భూమి లోపల పొరల్లో దాగి ఉండే కీటకాలు గుడ్లు, శిలీంద్రాలు వేసవి దుక్కులు చేయడం ద్వారా బయటపడి ఎండ తీవ్రతకు చనిపోతాయి. దుక్కుల ద్వారా భూమిలో కోశస్థ దశలోని పురుగులు నేలపై భాగానికి రావడంతో పొలాలపై తిరిగే పక్షులు వాటిని తినేస్తాయి. పంట కోత తర్వాత మిగిలిన అవశేషాలు, చెత్తాచెదారం లోతు దుక్కులు చేయడంతో పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ పదార్థంగా మారి పంటలకు బలాన్నిస్తుంది. కలుపు మొక్కలు చనిపోతాయి. వేసవి దుక్కులతో గట్టిగా ఉండే భూమి గుల్లబారుతుంది. తద్వారా వర్షం పడిన సమయంలో భూమిలోకి నీరుచొచ్చుకొని పోయే స్వభాగం, నీటిని నిల్వ ఉంచుకునే సామర్థ్యం పెరుగుతుంది. విత్తనం విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. భూమిని దున్నడం ద్వారా భూమి పొరల్లోకి గాలి బాగా చేరుతుంది. తద్వారా సూక్ష్మ జీవుల సాంద్రత, సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది. తద్వారా భూమిలోని పోషకాలను మొక్క గ్రహించేందుకు అనుకూలంగా ఉంటుంది. వేసవిలో భూమిని దున్నేటప్పుడు వాలుకు అడ్డంగా దున్నాలి. దీంతో గాలి, వర్షం నీటి ద్వారా భూమి కోతకు గురికాకుండా ఎక్కడ పడిన వర్షపు నీరు అక్కడే ఇంకిపోతుంది.



గుత్తి మండలం తొండపాడులో ట్రాక్టర్‌లోకి సేంద్రియ ఎరువులు వేస్తున్న రైతులు

వేసవి దుక్కులు చాలా ముఖ్యం



వేసవి దుక్కులు చేసుకోవడం చాలా ముఖ్యం. వేసవిలో భూమిని దుక్కి దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు ఎక్కువగా పెరగడంతో పాటు భూమిలో ఉండే నీటిని, పోషక పదార్థాన్ని గ్రహిస్తాయి. దీంతో భూమిలోపలి పొరల నుంచి నీరు ఆవిరైపోతుంది. తద్వారా భూసారం తగ్గడంతోపాటు సాగు చేసిన పంటలకు అవసరమైన పోషకాలు లభించవు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం కష్టమవుతుంది. గత కొన్ని రోజులుగా కురిసే వర్షాలను ఉపయోగించుకొని భూమిని రెండు నుంచి మూడు అడుగుల లోతు దుక్కి చేసుకుంటే మంచి ఫలితాలొస్తాయి.

-ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి

డబుల్ యాక్షన్ సారు..

విద్యుత్ శాఖాధికారి వింత వైఖరి



- క్షేత్రస్థాయిలో పనులకు అడ్డంకులు..
- ఆనక.. సిబ్బంది నిర్లక్ష్యం అంటూ చిందులు..
- పలు కారణాలు చెప్పి.. పైసా వసూల్



జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం

అనంతపురం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యుత్ శాఖలో ఓ అధికారి డబుల్ యాక్షన్‌తో కింది స్థాయి అధికారులు, సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఓవైపు క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులకు సామగ్రి ఇవ్వకుండా ఆయనే అడ్డుపడతారు. మరోవైపు మీటింగుల్లో పనుల పూర్తిలో నిర్లక్ష్యం చేస్తున్నారంటూ కిందిస్థాయి అధికారులు, సిబ్బందిపై చిందులు తొక్కుతారు. ఆయన తీరుతో అందరూ విస్తుపోతున్నారు. చెప్పేదీ ఆయనే.. అవి అమలు కాకుండా అడ్డుకునేదీ ఆయనే. 'ఎవరితో చెపుకుంటారో చెప్పుకోండి.. నేనింతే. ఆశామాషీగా సీట్‌లోకి రాలేదు. పెద్దల అండదండలతోనే వచ్చా. నన్నెవరూ ఏమీ చేయలేరు' అని బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఆయనలో మరో కోణం కూడా ఉందట. వివిధ కారణాలు చెప్పి పైసావసూల్ చేస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఓవైపు అధికార దర్పం చూపుతూనే.. మరోవైపు.. చడీచప్పుడు కాకుండా పైసావసూల్ చేసేస్తున్నాడంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు.

అన్నీ ఆయనే..

విద్యుత్ శాఖలో ఏ పని కావాలన్నా ఏదో ఒక వంకతో సాగదీస్తారన్న అపవాదు ముందు నుంచీ ఉంది. వినియోగదారులు, రైతులకు సామగ్రి ఇవ్వకుండా పనులు చేయాలని పురమాయిస్తారట. సామగ్రి ఇవ్వకుండా ఎలా పనులు చేయాలనికిందిస్థాయి అధికారులు వాపోతున్నారు. గత నెలలో జిల్లాకు కండక్టర్ (విద్యుత్ వైరు) రాగా.. సదరు అధికారి దానిని ఇవ్వట్లేదని సంబంధిత వర్గాలు విమర్శిస్తున్నాయి. అలాంటపుడు క్షేత్రస్థాయిలో పనులు చేయలేదంటూ చిందులు వేయడంలో అర్థం లేదంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రోజూ టెలీకాన్ఫరెన్స్‌లో గంటల తరబడి.. 'ఫలానా మండల అధికారి పనిచేయడం లేదనీ, ఏం చేస్తున్నారనీ, వినియోగదారులు నా దగ్గరకు రాకూడదం'టూ ఎడాపెడా.. మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పనులు చేసేందుకు అవసరమైన సామగ్రి అందించకుండా అడ్డుపడుతున్నది ఆయనేనని సంబంధిత అధికారులు ఆవేదన చెందుతున్నారు. అలాటపుడు పనులెలా ముందుకు సాగుతాయంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బినామీ ద్వారా పైసా వసూల్

టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడటం.. క్షేత్రస్థాయిలో అధికారులపై చిందులు వేయడం అంటే పైస్థాయి అధికారిగా చేస్తున్నాడు అనుకోవచ్చు. ఆయనలో మరో కోణం ఉందంటూ చర్చలు సాగుతున్నాయి. ఓ బినామీని నియమించుకుని పైసావసూల్‌కు దిగుతున్నట్లు సమాచారం. ఓ సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ కాంట్రాక్టర్‌ను బినామీగా నియమించుకున్నట్లు ఆయావర్గాల ద్వారా తెలుస్తోంది. సదరు కాంట్రాక్టరు.. వైసీపీకి చెందిన వ్యక్తి అని తెలుస్తోంది. సదరు కాంట్రాక్టర్ అక్రమ వసూళ్లలో ఆరితేరినట్లు సమాచారం. అతడిని బినామీగా పెట్టుకుని సదరు అధికారి పెద్ద వర్కులు కూడా చేస్తున్నారన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ పరిధిలో ఓ అధికారి ఉద్యోగ విరమణ చెందారు. ఆయన ఉద్యోగ విరమణకు, మీడియా ప్రతినిధులకు ఇవ్వాల్సి ఉందంటూ పెద్ద మొత్తంలోనే వసూలు చేసినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో ఒక్కో అధికారి నుంచి రూ.10వేల చొప్పున వసూలు చేయించినట్లు సంబంధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇలా సదరు అధికారి గుట్టుచప్పుడు కాకుండా అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వసూలు చేయిస్తున్నది ఆ శాఖాధికారే కావడంతో ఎవరూ నోరు మెదపని పరిస్థితి.

శాప్ చైర్మన్ చొరవ

- పీటీసీపై పోలీసుల జోక్యం వద్దంటూ ప్రభుత్వం ఆదేశాలు
- కలెక్టర్, ఎస్పీకి సూచనలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు, వాకర్స్

అనంతపురం క్లాక్‌టవర్, మే 18(ఆంధ్రజ్యోతి): కొన్నాళ్లుగా నడుస్తున్న నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియం సమస్య కొలిక్కి వచ్చింది. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు చొరవతో స్టేడియం సమస్య పరిష్కారమైంది. క్రీడాకారులు, వాకర్స్‌ను లోపలికి రాకుండా అడ్డుకుంటున్న విషయాన్ని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు శాప్ చైర్మన్ వివరించారు. స్పందించిన మంత్రి.. సమస్య పరిష్కరించాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు తెలిపారు. ఆదివారం రాష్ట్ర హోంమంత్రి, డీజీపీ కార్యాలయాల నుంచి నీలం సంజీవరెడ్డి స్టేడియంపై పీటీసీ పోలీసులు జోక్యం చేసుకోవద్దనీ, క్రీడాకారులు, వాకర్స్‌ను ఇబ్బందులు పెట్టవద్దంటూ కలెక్టర్, ఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు. దీంతో క్రీడాకారులు, వాకర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక

- భారీ పోలీసు బందోబస్తు
- పరిశీలించిన డీఎస్పీ

రామగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఉప ఎన్నికను సోమవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు గదిలో ఎన్నిక ఏర్పాట్లు చేశారు. ఎన్నిక గదిలోకి అనుమతించిన మీడియా ప్రతినిధులు తప్ప ఇతరులకు ప్రవేశం ఉండదని అధికారులు తెలిపారు. ఎన్నికపై డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్ ఎంపీడీఓ కమలాబాయితో సమీక్షించారు. ఎన్నిక గదిలోనూ, బయట సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎన్నిక సందర్భంగా ప్రత్యేక బలగాలను రప్పించారు. ఇద్దరు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 18 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు మొత్తం 94 మంది, హోంగార్డులు 30 మంది, ఏపీఎస్పీ పోలీసులు రెండు ప్లటూన్స్, మూడు స్పెషల్ పార్టీ బృందాలు ఎన్నికల విధులో శాంతి భద్రతలను పరిరక్షించనున్నాయి. 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు తెలిపారు.



పోలీసు బందోబస్తుపై సమీక్షిస్తున్న డీఎస్పీ

దంచికొట్టిన వాన

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- రొచ్చుమర్రిలో పిడుగుపాటుకు కూలిన షెడ్డు
- దెబ్బతిన్న పంటలు



ఛాయాపురం వద్ద కోతకు గురైన హంద్రీనీవా కాలువ గట్టు

4

ఆర్డీటీని కాపాడుకుందాం : గాయని మంగ్లీ

అనంతపురం కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఎంతోమంది భవిష్యత్తుకు బాటలు వేసిన ఆర్డీటీని కాపాడుకుందామని సినీ గాయని మంగ్లీ పిలుపునిచ్చారు. 'ఆర్డీటీని కాపాడుకుంటే మనల్ని మనం కాపాడుకున్నట్లే'నన్నారు. ఆర్డీటీ సేవలను కొనసాగించేలా ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని కోరుతూ ఆ సంస్థ శాస్త్రీయ, సంగీత కళాశాలలో శిక్షణ పొంది స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో 'శాస్త్రీయ సంగీత నృత్య కళాంజలి' నిర్వహించారు. కార్యక్రమానికి సినీ గాయని, ఆర్డీటీ పూర్వ విద్యార్థిని మంగ్లీ హాజరై ప్రసంగించారు. ఆర్డీటీ ద్వారా పొందిన శాస్త్రీయ సంగీత శిక్షణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. వేలాదిమంది అభివృద్ధికి ఆర్డీటీ వేదికగా నిలిచిందన్నారు. అలాంటి సంస్థ సేవలు ఆగిపోతే లక్షలాదిమంది ప్రజలకు అన్యాయం వాటిల్లుతుందన్నారు. ఆర్డీటీకి అండగా ప్రతిఒక్కరూ పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మంగ్లీ శాస్త్రీయ సంగీతంతో అలరింపజేశారు. పలువురు చిన్నారులు శాస్త్రీయ నృత్యంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో లలితకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ, ఆర్డీటీ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



శాస్త్రీయ సంగీతంతో అలరిస్తున్న గాయని మంగ్లీ

హసీనాబానుపై బదిలీ వేటు

- అక్రమ వసూళ్లు, ఆఫీస్‌బాయ్‌పై చెప్పుతో దాడి ప్రభావం
- వివాదాస్పద కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐపై విచారణ
- ఎక్సైజ్ కమిషనర్‌కు నివేదిక
- ఒకటి, రెండు రోజుల్లో సస్పెన్షన్ ఉత్తర్వులు..?
- సీఐ వ్యవహారంపై కలెక్టర్, ఎస్పీ సీరియస్

(వివరాలు 4వ పేజీలో....)

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

అనంతపురం క్లాక్‌టవర్, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని అన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పులను తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

అనంతపురం విద్య, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు, ఇతర అంశాలపై ఈనెల 21న తలపెట్టిన డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులు తరలిరావాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో వైఎస్ఆర్‌టీఏ జిల్లా నాయకుడు నాగిరెడ్డి, ఆప్టా నాయకుడు వెంకటరత్నం ఆధ్వర్యంలో సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాశాఖలో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల గ్రామీణ విద్యావ్యవస్థ విచ్ఛిన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. గత ప్రభుత్వం ఆరు స్కూళ్లు తెస్తే..ఈ ప్రభుత్వం తొమ్మిది రకాల స్కూళ్లు తేవాలని చూస్తోందని, ఫలితంగా తీరని నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, లింగమయ్య, గోవిందరాజులు, రాయల్ వెంకటేష్, సిరాజుద్దీన్, జయరామిరెడ్డి, బాలమురళి, శ్రీధర్‌గౌడ్, రమణ, రవీంద్ర, హరికృష్ణ, రవీంద్ర, శివానందరెడ్డి, నరసింహారెడ్డి, ఓబులేసు, వెంకటేషులు, సుబ్బయ్య పాల్గొన్నారు.

బస్సులో తడిసి ముద్దయ్యారు..


ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

హిందూపురం, మే 18(ఆంధ్రజ్యోతి): హిందూపురం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు తడిసి ముద్దయ్యారు. శనివారం రాత్రి తిరుపతి నుంచి బస్సు బయల్దేరింది. మదనపల్లి వద్దకు వచ్చేసరికి వర్షం కురియడంతో పూర్తిగా తడిసిపోయారు. బస్సులో ఉన్న ప్రయాణీకుల లగేజీ, ల్యాప్‌ట్యాప్‌లు తడిసిపోయాయి. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందిపడ్డారు. దీంతో బస్సు ఆపి గంట పాటు ప్రయాణీకులు ఆందోళన చేసినా ఎవరూ పట్టించుకోలేదు. బస్సుకు అద్దాలు లేకపోవడంతో వర్షపు నీరు లోపలికి చేరింది. ఎలాగోలా కదిరికి అదే బస్సులో చేరుకున్నారు. అక్కడ మరోసారి ప్రయాణికులు ఆందోళనకు దిగారు. దీంతో ప్రత్యామ్నాయంగా మరో బస్సు ఏర్పాటుచేశారు. ప్రయాణీకులు హిందూపురం చేరుకున్నాకా బస్సు డిపో వద్ద తిరిగి ఆందోళన చేశారు. దూరప్రాంతాలకు వెళ్లే బస్సుకి అద్దాలు, టాప్ సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడ్డామన్నారు. ప్రయాణీకుల బాధలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

స్వరా ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి కేశవ్


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం క్లాక్‌టవర్, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతీనగర్‌లో స్వరా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చేతుల మీదుగా ప్రారంభించారు. నగరంలో ప్రజల అవసరాలకు అను గుణంగా అత్యాధునిక హంగులు, వసతులతో నూతన ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు చౌకగా మెరుగైన వైద్యసేవలు అందించి అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డాక్టర్లు రాకేష్‌నాయక్, ఎండి నాయక్, ఎం శ్వేత పాల్గొన్నారు.


రొచ్చుమర్రిలో పిడుగుపాటుకు కూలిన రేకులషెడ్డు


తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు


వీరఓబునపల్లి వద్ద కొట్టుకుపోయిన వేరుశనగ మొలకలు

దంచికొట్టిన వాన

పొంగిపొర్లిన వాగులు, వంకలు
రొచ్చుమర్రిలో పిడుగుపాటుకు కూలిన షెడ్డు
దెబ్బతిన్న పంటలు


విడపనకల్లు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఆర్ కొట్టాల-గడేకల్లు వంక

అనంతపురం అర్బన్/విడపనకల్లు/బొమ్మనహాల్/కణేకల్లు/పెనుకొండ రూరల్/ఉరవకొండ/రాయదుర్గం, మే 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి వాన దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలుచోట్ల వాహన రాకపోకలు స్తంభించాయి. రెండుచోట్ల పిడుగులు పడ్డాయి. భారీ వర్షానికి పలు పంటలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో కూడిన వర్షానికి గార్లదిన్నె మండలంలోని మర్తాడు, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల్లో 24 మంది రైతులకు సంబంధించి 12 హెక్టార్లల్లో రూ.7.4 లక్షల విలువైన వరి పంట దెబ్బతింది.

పొంగిన వాగులు, వంకలు...

విడపనకల్లు మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఆర్ కొట్టాల-గడేకల్లు మధ్య పెద్ద వంక ఉధృతంగా ప్రవహించటంతో విడపనకల్లు నుంచి గుంతకల్లుకు వాహన రాకపోకలు బంద్ అయ్యాయి. మధ్యాహ్నం వంక ఉధృతి తగ్గటంతో వాహనాల రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి. ఉండబండ గ్రామసమీపంలోని వంక పొంగి బీసీ కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరింది. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాల్తూరు-గోవిందవాడ వంక, ఉండబండ-ఉరవకొండ వంక, పొలికి-అంచనహాలు వంకలు ఉధృతంగా ప్రవహించటంతో ఆయా ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకూ రాకపోకలు నిలిచిపోయాయి.


ఛాయాపురం వద్ద కోతకు గురైన హంద్రీనీవా కాలువ గట్టు

● ఉరవకొండ మండలం పాల్తూరు వద్ద వంక పొంగిపొర్లడంతో ఉరవకొండ-హొన్నూరుకు ఉదయం 10 గంటల వాహనాల రాకపోకలు బంద్ అయ్యాయి. ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీలోని గుడారాల్లోకి వర్షపు నీరుచేరడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఛాయాపురం వద్ద హంద్రీనీవా కాలువ గట్టు కోతకు గురైంది. కాలువలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది.

పత్తి రైతు గుండెల్లో గుబులు

రాయదుర్గం: పట్టణంలో వీధులు జలమయమయ్యాయి. దాసప్పవీధి, ప్యాలెస్‌రోడ్డుతోపాటు మధుటాకీస్ ప్రాంతాల్లో ఇళ్ల మధ్య నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు కారణంగా రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. సీతమ్మ కుంట, ఒట్లకుంటలో నీరు చేరింది.

బొమ్మనహాళ్‌లో..

బొమ్మనహాళ్ మండలంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆదివారం ఉదయం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఎర్పడింది. భారీ వర్షం.. పత్తి రైతుల గుండెల్లో గుబులు రేపింది. పత్తి పంట చేతికొచ్చిన సమయంలో వర్షం రావడంతో నీరు పత్తి పొలంలో చేరి చెట్లు వాడుముఖం పట్టి ఆకులు నేలవైపు వాలుతున్నాయి. దీంతో మొక్క కుళ్లిపోతోందని రైతులు వాపోతున్నారు. పత్తి కాయలు కూడా రాలిపోతాయని ఆందోలన చెందుతున్నారు. మొక్కజొన్న, వరి ధాన్యం తడిసిపోయాయని వారు ఆవేదన చెందుతున్నారు.

కూలిన షెడ్డు

కణేకల్లు మండలం రచ్చుమర్రి గ్రామం వద్ద పిడుగు పడింది. ఆ ధాటికి సమీపంలోని రేకుల షెడ్డు కూలిపోయింది. అందులోని గేదె, రెండు పోతులు మరణించాయి. మరో నాలుగు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో పాడి రైతు మొండేలు హనుమంతుకు రూ.2.50 లక్షల మేర నష్టం వాటిల్లింది. మండలంలోని నాగేపల్లి, కణేకల్లు తదితర గ్రామాల పరిధిలో నిలువ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. సొల్లాపురం వద్ద వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి.


కల్లుదేవనహళ్లి వద్ద పత్తి పంటలో నిలిచిన నీరు

కొట్టుకుపోయిన వేరుశనగ మొక్కలు

ఓబుళదేవరచెరువు: మండలంలో వర్షానికి వేరుశనగ, వరి పంటలకు నష్టం వాటిల్లింది. వీర ఓబునపల్లికి చెందిన చిన్నబాబు పొలంలో ఒక టిన్నర ఎకరాలో సాగుచేసిన వేరుశనగ మొలకెత్తిన దశలో ఉండగా.. వర్షానికి కొట్టుకుపోయిందనీ, రూ.పదివేలదాకా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. బావాసాహెబ్‌పల్లి రైతులు కృష్ణమూర్తి, రామప్ప సాగుచేసిన వరి పంట గాలివానకు నేలకొరిగింది. పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన నరసింహప్ప ఇంటివద్ద పెంచుకున్న టెంకాయచెట్టుపై పిడుగు పడి దగ్ధమైంది.

అనంతలో భారీ వర్షం

అనంతపురంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పలు కూడళ్లలో పెద్దఎత్తున నీరు చేరింది. శింగనమల, గార్లదిన్నె, డీ.హీరేహాళ్, కూడేరు, బుక్కరాయసముద్రం తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది.

వర్షపాతం నమోదు ఇలా..

గోరంట్లలో 96.2, విడపనకల్లు 95.4, ఉరవకొండ 89.2, వజ్రకరూరు 86.2, బెలుగుప్ప 75.4, అమడగూరు 74.8, బొమ్మనహాళ్ 67.4, బ్రహ్మసముద్రం 56.4, చెన్నేకొత్తపల్లి 55.4, గుంతకల్లు 52.6, గుమ్మఘట్ట 52.2, కణేకల్లు 46.8, పుట్టపర్తి 46.4, రాయదుర్గం 45.6, కొత్తచెరువు 42.6, కూడేరు 42.4, పెనుకొండ 41.4, కదిరి 38.6, గార్లదిన్నె 37.6, ముదిగుబ్బ 36.4, ఓబుళదేవరచెరువు 35.4, యల్లనూరు 34.6, తనకల్లు 32.2, శెట్టూరు 31.6, అనంతపురం 30.2, నల్లమాడ 28.2, డి.హిరేహాళ్ 27.2, గుడిబండ 26.8, నల్లచెరువు 26.2, సోమందేపల్లి 23.4, రామగిరి 23.2, హిందూపురం 22.6, పామిడి 22.4, బుక్కపట్నం 21.0, ఆత్మకూరు 20.0, తాడిపత్రి, కళ్యాణదుర్గం, గుత్తి 19.4, చిలమత్తూరు 18.2, నంబులపూలకుంట 18.0, రొద్దం 17.0, మడకశిర 16.6, రొళ్ల 15.4, లేపాక్షి 14.8, పరిగి 14.6, కుందుర్పి 13.4, గాండ్లపెంట 11.0, అమరాపురం 9.8, అగళి 7.4, కనగానపల్లి 4.2, తాడిమర్రి 3.4, ధర్మవరం, తలుపుల 2.4, బత్తలపల్లి 2.2 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

హసీనాబానుపై బదిలీ వేటు

అక్రమ వసూళ్లు, ఆఫీస్‌బాయ్‌పై చెప్పుతో దాడి ప్రభావం

వివాదాస్పద కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐపై విచారణ

ఎక్సైజ్ కమిషనర్‌కు నివేదిక

ఒకటి, రెండు రోజుల్లో సస్పెన్షన్ ఉత్తర్వులు..?

సీఐ వ్యవహారంపై కలెక్టర్, ఎస్పీ సీరియస్


ఎక్సైజ్ సీఐ హసీనాబాను

అనంతపురం అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): అక్రమ వసూళ్ల ఆరోపణలు, ఆఫీస్ బాయ్‌పై చెప్పుతోదాడి ఘటన నేపథ్యంలో కళ్యాణదుర్గం సీఐ హసీనాబానుపై బదిలీవేటు పడింది. కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో కర్ణాటక అక్రమ మద్యం సరఫరాను అరికట్టాల్సిన సదరు సీఐ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటక అక్రమ మద్యం, టెట్రాప్యాకెట్లు దొరికితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందిపోయి.. ఆఫీస్ బాయ్ ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇదే క్రమంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న వారి నుంచి డబ్బులు వసూలు చేసుకొని రావాలని ఆఫీస్ బాయ్ నానిపై ఒత్తిడి పెంచినట్లు సమాచారం. ఆ ఒత్తిడి భరించలేని ఆఫీస్‌బాయ్ ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం సంఘం నాయకులు కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి, ఆఫీస్ బాయ్ ఫిర్యాదుపై సీఐని ప్రశ్నించారు. ఈ సమయంలో తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేసి, వాళ్లకు ఫిర్యాదు చేస్తావా అంటూ సంఘం నాయకుల సమక్షంలోనే సీఐ హసినాబాను ఆఫీస్ బాయ్ చెంపపై చెప్పుతో దాడి చేశారు. ఈ ఘటనను అక్కడి సిబ్బంది వీడియోతీసి సంబంధిత ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అప్పట్లో జిల్లా కేంద్రం నుంచి ఓ అధికారి విచారణకు వచ్చినా ఎలాంటి ప్రయోజనం లేకపోయినట్లు తెలిసింది. దీంతో ఆ వీడియోను సోషల్ మీడియాతో పెట్టడంతో పెద్ద దుమారం రేగింది. ఇదే క్రమంలో 'ఆంధ్రజ్యోతి'లోనూ 'వికటించిన వసూళ్ల పర్వం' శీర్షికన సీఐ వ్యవహారంపై ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే.

ఎక్సైజ్ కమిషనర్‌కు నివేదిక

కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ హసీనాబాను అక్రమ వసూళ్లు, ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టడం తదితర పరిణామాలపై విచారించేందుకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. దీంతో ఆయన కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో జరిగిన పరిణామాలపై శనివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి దాకా సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. క్షేత్ర స్థాయిలో జరిగిన పరిణామాలపై నివేదికలో పొందుపర్చినట్లు సమాచారం. ఇదే క్రమంలో ఆఫీస్ బాయ్ నాని ఆధార్ కార్డు ఆధారంగా 17 సంవత్సరాల వయస్సు మాత్రమే ఉన్నట్లు విచారణలో తేలినట్లు సమాచారం. కార్మిక చట్టం మేరకు 18 సంవత్సరాల్లోపు బాలలను పనిలో పెట్టుకోకూడదు. కళ్యాణదుర్గం ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మైనర్‌ను ఏ రకంగా పనిలో పెట్టుకున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డబ్బులు వసూళ్లు చేసుకొని రావాలని మైనర్‌పై ఒత్తిడితేవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కు ఆదివారం సమగ్ర విచారణ నివేదిక పంపినట్లు తెలిసింది.

నివేదిక ఆధారంగా బదిలీ

విచారణ నివేదిక ఆధారంగా కళ్యాణదుర్గంలో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగకుండా ప్రాథమికంగా హసీనాబానుపై బదిలీవేటు వేశారు. ఉరవకొండ మొబైల్ పార్టీకి ఆమెను బదిలీ చేస్తూ తక్షణమే అక్కడ రిపోర్టు చేసుకోవాలని కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే క్రమంలో విడపనకల్లు చెక్ పోస్టు సీఐ గురుప్రసాద్‌కు కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. విచారణ నివేదికల ఆధారంగా ఒకటి, రెండు రోజుల్లో ఎక్సైజ్ సీఐ హసీనాబానును సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు ఆ శాఖలో చర్చసాగుతోంది.

కలెక్టర్, ఎస్పీ సీరియస్

కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ వ్యవహారాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. ఇంటెలిజెన్స్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు క్షేత్ర స్థాయిలో సీఐ హసీనాబాను అక్రమ వసూళ్లు, ఆఫీస్ బాయ్ వ్యవహారంపై సమగ్ర నివేదికలను ఇప్పటికే ఎస్పీ కార్యాలయానికి అందజేసినట్లు తెలిసింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటన సమయంలో ఎక్సైజ్ సీఐ వ్యవహారం దుమారం కావడంతో కలెక్టర్ సీరియస్‌గా పరిగణనించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సమగ్ర నివేదికలు తెప్పించుకోవాలని జేసీని ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. కలెక్టర్, ఎస్పీ సీరియస్‌గా పరిగణించిన నేపథ్యంలో సీఐ వ్యవహారం సీఎం కార్యాలయం దాకా వెళ్లే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అరెస్టు చేయాలి

కళ్యాణదుర్గం(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎక్సైజ్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ నానిని చెప్పుతో కొట్టిన ఎక్సైజ్ సీఐ హసీనాబానుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని బాధితుడి తల్లి లిఖిత, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు, బీజేపీ నాయకులు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం పట్టణ సీఐ యువరాజుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. తక్షణమే ఆమెపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు మల్లికార్జునస్వామి, రవి, శీన, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ముప్పూరి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.


సీఐకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడి తల్లి, బీజేపీ నాయకులు

యువకుడి దారుణహత్య

రాయదుర్గం, మే 18(ఆంధ్రజ్యోతి): టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వినోద్‌కుమార్(22) అనే యువకుడిని ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళితే.. రాయదుర్గం మండలం కొంతానపల్లికి చెందిన వినోద్‌కుమార్ శనివారం రాత్రి రాయదుర్గంలో జరిగిన రథోత్సవ వేడుకలను చూసుకుని సొంతూరుకు బయలుదేరాడు. తల్లి అంజినక్క, తండ్రి అంజినప్ప శనివారం అర్ధరాత్రి వరకు కొడుకు కోసం ఎదురు చూశారు. కానీ ఆదివారం ఉదయానికి కొంతానపల్లి గ్రామ సమీపంలో ఉన్న పొలంలో వినోద్‌కుమార్ శవంగా ప్రత్యక్ష్యమయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ జయనాయక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కత్తితో గొంతును కోసి హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. వివాహేతర సంబంధం కోణంలో హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

- పాత విద్యార్థులకు చివరి అవకాశం
- 42 కేంద్రాల్లో ఏర్పాట్లు
- డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవిందునాయక్

అనంతపురం విద్య, మే 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 28 వరకూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవిందునాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత సిలబస్‌తో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఇదే చివరి అవకాశమని, ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరయ్యేలా హెచ్‌ఎంలు, తల్లిదండ్రులు చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో 42 కేంద్రాల్లో రెగ్యులర్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకూ, ఓపెన్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకూ ఉంటాయన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 11,493 మంది, ఓపెన్ టెన్త్, ఇంటర్ 2,998 మంది పరీక్షలు రాస్తారని అన్నారు. గంట ముందుగానే కేంద్రాలకు రావాలని, చివరి నిమిషంలో కంగారుగా రాకుండా చూడాలని పేర్కొన్నారు.

హంద్రీనీవాపై ప్రజల మధ్యనే చర్చిద్దాం

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

గుంతకల్లుటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): 'మా ఇంటికి మీరు రావటం.. మీ ఇంటికి నేను రావటం అనేది ఇది ఏమీ ఆస్తి విషయం కాదు.. ప్రజలకు సంబంధించిన సమస్య.. హంద్రీనీవా కాలువపై ప్రజల మధ్యనే చర్చిద్దాం' అని వైసీపీ ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడుసార్లు శంకుస్థాపన చేసి మూడు కిలోమీటర్లు కూడా హంద్రీనీవా కాలువ తీయలేని టీడీపీ నాయకులు మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హంద్రీనీవా కాలువ పనులు జరిగాయని గుర్తించుకోవాలన్నారు. ఉరవకొండలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు ఉన్నాయని తెలిపారు. అక్కడే ఈనెల 21న వేదిక ఏర్పాటు చేసి, కాలవ శ్రీనివాసులు వారి నాయకులతో కలిసి రావాలన్నారు. సమావేశంలో నాయకులు నక్క భీమలింగప్ప, నాగేశ్వరరావు, తిమ్మప్ప, అబ్దుల్ బాసిద్, రాంబాబు, నూరి, శంకర్ పాల్గొన్నారు.

తాడిపత్రి పర్యటన

వాయిదా వేసుకోండి

ప్రస్తుత పరిస్థితుల్లో భద్రత ఇవ్వలేం
పెద్దారెడ్డికి ఎస్పీ సూచన

అనంతపురం క్రైం, మే 18(ఆంధ్రజ్యోతి): తాడిపత్రికి మరోసారి వెళ్లరు లెండి...ప్రస్తుతం జిల్లాలో జరిగిన సంఘటనలు, ఇతర బందోబస్తు నేపథ్యంలో భద్రత ఇవ్వలేమని ఎస్పీ జగదీష్ తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి స్పష్టం చేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ఈనెలలో తొలుత పెద్దారెడ్డి జిల్లా ఎస్పీని కలిశారు. ఈనెల 9న సీఎం పర్యటన అనంతరం వెళ్లేలా సూచించారు. కానీ కుదర్లేదు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం ఈనెల 18వతేదీ తాడిపత్రికి వెళ్తామని పెద్దారెడ్డి ఎస్పీకి మెయిల్ ద్వారా విషయం తెలియజేశారు. ఇందుకు ఎస్పీ శనివారం మెయిల్ ద్వారానే సమాధానం ఇచ్చారు. మహానాడు, రాప్తాడు మండలంలో జరిగిన జంట హత్యలు, కుప్పంలో సీఎం బందోబస్తు, ఎంపీపీ ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం భద్రత కల్పించలేమని, కొన్ని రోజులు తాడిపత్రికి వెళ్లడం వాయిదా వేసుకోవాలని సూచించారు. త్వరలో ఎప్పుడు వెళ్లాలనే తేదీ చెబుతామని అందులో పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ప్రేమ పెళ్లి చేసుకున్నారని ఘర్షణ

● ముగ్గురికి తీవ్రగాయాలు

నార్పల, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగుమర్రి గ్రామంలో శనివారం సాయంత్రం ప్రేమ పెళ్లి చేసుకున్నారని ఓ యువకుడు, అతడి బంధువులపై యువతి బంధువులు దాడికి పాల్పడ్డారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన శివశంకర్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన రమేష్ కుమార్తె ప్రశాంతిని రెండు రోజుల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పెళ్లి చేసుకొని స్వగ్రామానికి వెళ్లారు. కోపోద్రిక్తుడైన యువతి తండ్రి రమేష్, అతడి బంధువులు మరో ముగ్గురు కలసి రాడ్‌లు, కట్టెలతో యువకుడు శివశంకర్, అతడి బంధువులపై దాడి చేశారు. ఈ దాడిలో మల్లికార్జున, నల్లప్ప, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో రమేష్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. దాడి చేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కమిటీ సభ్యుడిగా పూల నాగరాజు



అనంతపురం కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కమిటీ సభ్యుడిగా ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు నియమితులయ్యారు. ఆదివారం కడపలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఆయన నియామకంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశాయి.

ఆర్ఈఎఫ్ రాష్ట్ర మహిళా కో కన్వీనర్‌గా మంజులాదేవి



అనంతపురం క్లాక్‌టవర్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆర్ఈఎఫ్ రాష్ట్ర మహిళా కో కన్వీనర్‌గా మంజులాదేవి నియమితులయ్యారు. రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రరావు నుంచి ఆదివారం నియామకపత్రం అందుకున్నట్లు మంజులదేవి తెలిపారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వైశ్యా హాస్టల్ కార్యదర్శిగా ముడియం రమణ



అనంతపురం కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య విద్యార్థుల వసతి గృహం(వైశ్య హాస్టల్) కార్యదర్శిగా ముడియం రమణ నియమితులయ్యారు. ఈమేరకు ఆదివారం వైశ్య హాస్టల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మేడా రామనాథ్, శబరి ఉత్తర్వులు జారీ చేశారు. వైశ్య హాస్టల్ అభివృద్ధితో పాటు హాస్టల్‌లోని విద్యార్థులను క్రమ శిక్షణతో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని ఈ సందర్భంగా ముడియం రమణ పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు హెల్ప్‌డెస్క్ : ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, మే 18(ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో సందేహాల నివృత్తికోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. ఇంటర్మీడియేట్ పూర్తిచేసిన విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నగరంలోని జేఎన్టీయూ, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మధ్యనున్న కేఎస్ఎన్ కళాశాలలో హాస్టల్ వసతితో పాటు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ ఉన్నాయన్నారు. విద్యార్థులు 9440418274, 9441552643, 9398030817 నెంబర్లకు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని ప్రిన్సిపాల్ సత్యవతి కోరారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త : డాక్టర్ ప్రసూన

అనంతపురం కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): రానున్నది వర్షాకాలం కాబట్టి మూర్ఛ వ్యాధి రోగులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని జేవీవీ నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం గిల్డ్ ఆఫ్ సర్వీస్ హైస్కూల్ వద్ద నిర్వహించిన మూర్ఛ వ్యాధి వైద్య శిబిరానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూర్ఛ వ్యాధి బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. అనంతరం దాదాపు 110 మంది మూర్ఛ వ్యాధి బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరికిషోర్, జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి, నాయకులు టీచర్ నాగరత్నమ్మ, తిరుపాలు, ముత్యాలు, ప్రసాద్‌రెడ్డి, ఎర్రిస్వామి, రాధాకృష్ణ, నూర్ మహ్మద్, శివచరణ్, మన్సూర్ పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ. 4.13 లక్షలు

అనంతపురం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు పశువులసంతతో రూ.4.13 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.52 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.61 లక్షలు వచ్చిందని తెలిపారు.

ఆటో బోల్తా - 8 మందికి గాయాలు

రాప్తాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు వద్ద జాతీయరహదారిపై వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. అనంతపురం నగరంలోని తపోవనానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు ఆదివారం నసనకోట ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లారు. పూజలు ముగించుకుని తిరిగి అనంతపురానికి బయలుదేరారు. మరూరు సమీపంలో జాతీయరహదారిపై సాయంత్రం 7 గంటల సమయంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి వివరాలు తెలియరాలేదు.

రాప్తాడులో కొనసాగుతున్న పోలీస్ పికెట్

రాప్తాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన రాప్తాడులో భూ తగాదా విషయంలో శనివారం రైతు దంపతులు నారాయణరెడ్డి (56), ముత్యాలమ్మ (46) దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. వారి మృతదేహాలకు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఆ మృతదేహాలకు గొల్లపల్లిలో అంత్యక్రియలు జరిపారు. దంపతల హత్య నేపథ్యంలో రాప్తాడులో నారాయణరెడ్డి ఇంటి వద్ద, తదితర ప్రదేశాల్లో పోలీస్ పికెట్ కొనసాగిస్తున్నట్లు రాప్తాడు సీఐ శ్రీ హర్ష తెలిపారు.



రాప్తాడులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

తీరని చింతమేకలపల్లి..!

నేటికీ గ్రామానికి మట్టి రోడ్డే దిక్కు

టీడీపీ హయాంలో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు

అటకెక్కించిన వైసీపీ

గ్రామస్థులకు తప్పని తిప్పలు



చింతమేకలపల్లి రోడ్డు

శింగనమల, మే18(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి జన్మించిన పంచాయతీలోని గ్రామానికి నేటికీ మట్టి రోడ్డే దిక్కయింది. బీటీ రోడ్డు కల నేటికీ నెరవేరలేదు. మండలంలోని తరిమెలలో నాగిరెడ్డి జన్మించారు. అదే పంచాయతీలోని చిన్న గ్రామం చింతమేకలపల్లి. గ్రామానికి నేటికీ బీటీ రోడ్డు వేయలేదు. గుంతలు పడిన మట్టి రోడ్డుపై ప్రయాణించాలంటే గ్రామస్థులు నరకం అనుభవిస్తున్నారు. గ్రామానికి బీటీ రోడ్డు వేసేందుకు టీడీపీ హయాంలో 2019లో నిధులు మంజూరు చేశారు. పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అప్పట్లో ఎన్నికలు రావడం, తర్వాత వైసీపీ అధికారం చేపట్టడంతో రోడ్డు అటకెక్కింది. వైసీపీ పాలకులు ఐదేళ్లలో రోడ్డు నిర్మాణం ఊసే పట్టించుకోలేదు.

హామీలతో సరి..

చింతమేకలపల్లిలో 30 నుంచి 40 కుటుంబాలున్నాయి. 200 మంది జనాభా ఉంది. గ్రామానికి రోడ్డు పెద్ద సమస్య. ఏళ్లుగా మట్టి రోడ్డుపైనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించి, రోడ్డు నిర్మాణాకి హామీ ఇవ్వడం, తరువాత గ్రామం వైపు కన్నెత్తి చూడకపోవడం పరిపాటిగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు.



చింతమేకలపల్లిలో అపరిశుభ్రత

టీడీపీ హయాంలో నిధులు మంజూరు

మండలంలోని గుమ్మేపల్లి నుంచి చింతమేకలపల్లికి, అక్కడి నుంచి తరిమెల రోడ్డు వరకు రెండు మార్గాల్లో తారురోడ్డు నిర్మాణానికి 2019లో రూ.1.90 కోట్లు సీఆర్ఆర్, ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులను అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి ఉపముఖ్యమంత్రి, హోంశాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, అప్పటి ఎమ్మెల్యే యామినీబాల భూమిభూజ చేసి, రోడ్డు పనులకు శ్రీకారం చూట్టారు. తరువాత ఎన్నికలు రావడంతో పనులు సాగలేదు.



రోడ్డు నిర్మాణానికి గతంలో వేసిన శిలాఫలకం

అనంతరం కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణం ఊసే పట్టించుకోలేదు. ఐదేళ్లలో రోడ్డుపై దృష్టి సారించిన పాపానపోలేదు. రోడ్డు నిర్మాణం అలాగే నిలిచిపోయింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు గ్రామానికి తారురోడ్డు వేయాలని చింతమేకలపల్లి ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఉచిత సామూహిక వివాహాలు



నూతన జంటలతో ఆశ్రమ నిర్వాహకులు, దాతలు

చెన్నేకొత్తపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి సద్గురు యోగి నారేయణ మఠంలో ఆదివారం ఉచిత సామూహిక వివాహాలను ఘనంగా నిర్వహించారు. మఠం నిర్వాహకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఎనిమిది జంటలు ఒక్కటయ్యాయి. నూతన వధూవరుల కుటుంబసభ్యులు, బంధువులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, మఠం నిర్వాహకులు నూతన జంటలను ఆశీర్వదించారు. బెంగళూర్‌కు చెందిన దాతలు అరుణ్‌కుమార్, సురేశ్‌బాబు ఉచిత వివాహాలకు తమవంతుగా చేయూతనందించారు. వివాహాలనంతరం మఠంలో భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో యోగి నారేయణ మఠం కమిటీ అధ్యక్షుడు నిమ్మలకుంట ఆదినారాయణ, ఉపాధ్యక్షులు నామాల శ్రీనివాసులు, జింకా రాజేంద్రప్రసాద్, వెంకటరాముడు, ఓబుళేశు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పాడి నేలలో విత్తన సాగుతో అధిక దిగుబడులు'

చెన్నేకొత్తపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): రుతుపవనాల కంటే ముందే పొడినేలలో విత్తనాలను వేయడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని రైతు సాధికారిక సంస్థ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని వెల్దుర్తి గ్రామంలో రాధమ్మ అనే మహిళా రైతు పొలంలో పీఎండీఎస్ విధానం ద్వారా ఆదివారం విత్తన సాగు చేపట్టారు. ఈ సందర్భంగా ఐదు ప్రధాన రకాలైన కంది, ఆముదం, సజ్జ, అలసంద, అనుములను పీజామృతంతో విత్తన శుద్ధి చేసి పొలంలో విత్తుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాధికారిక సిబ్బంది సురేంద్రరెడ్డి, అంజనేయులు, దివ్యశ్రీ, రామాంజి, రామాంజినేయులు, బాలనరసింహులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది, 2002-03 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు అందరు ఒకచోట కలిసి వారి క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకుంటూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు చదువులు చెప్పిన ఉపాధ్యాయులు అంజనేయులు, హెచ్ఎం నాగరాజు, విరూపాక్ష, శ్రీనివాసులు, యేగేశ్వరనాయుడు, రమేశ్, శ్రీదేవిని పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

వడ్డీతో రుణాలు రెన్యువల్ చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

అనంతపురం కల్చరల్, మే 18(ఆంధ్రజ్యోతి): రైతుల బంగారం రుణాలను వడ్డీ కట్టించుకుని, రెన్యువల్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జిల్లాలో రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు చేసి, తమ ఇళ్లల్లోని కొద్ది బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి పంటలు పండిస్తున్నా, కష్టానికి తగ్గ ప్రతిఫలం అందడంలేదన్నారు. దీంతో అప్పులపాలయ్యారన్నారు. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని, పండిన అరకొర పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులెదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ సంఖ్యలో కరువు మండలాలను ప్రకటించడంవల్ల మిగిలిన రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. దీనికి తోడు ప్రస్తుతం బ్యాంకుల్లో బంగారం రుణాలను అసలు, వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకర్లు చెబుతుండడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఉన్నారన్నారు. కావున పాత పద్ధతిలోనే రెన్యువల్ చేసేలా బ్యాంకులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి : సాకే హరి

అనంతపురం సెటల్, మే 18(ఆంధ్రజ్యోతి): దళితులపై జరుగుతున్న దాడులు అరికట్టపకోతే ఉద్యమిస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి పేర్కొన్నారు. ఆయన ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రమకృష్ణ, ఓబులేసు, బీకేఎస్ ఆనంద్,

షాపింగ్ కాంప్లెక్స్ కోసం తవ్వకం

● కూలిన పక్క భవనం ప్రహరీ



కాంప్లెక్స్ నిర్మాణానికి తవ్వడంతో కూలిన పక్క భవనం ప్రహరీ

అనంతపురం క్రైం, మే 18(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడా గ్యాప్ లేకుండా పక్క పక్కనే భవనాలు నిర్మించడం పరిపాటిగా మారింది. ఒక్కోసారి ఇలాంటి ఘటనలు ప్రమాదకరంగా మారుతున్నాయి. నగరంలో రామచంద్రనగర్‌లో వినాయక గుడి ఎదుట ఓ షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి తవ్వకాలు చేపట్టారు. దీంతో పక్కనే ఉన్న భవనం ప్రహరీ కూలింది. దీంతో ఆ ఇంట్లో ఉంటున్నవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

అనంతపురం సెటల్, మే 18(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, అసోసియేషన్ నాయకులు జయరాం, రాజారమేష్, శాంతిముణి, హృషికేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న గౌస్ మొహిద్దీన్ తదితరులు

నాడు అధ్వానం - నేడు సౌకర్యవంతం

నెమలివరానికి పూర్తైన తారురోడ్డు నిర్మాణం



నాడు గుంతలతో అధ్వానంగా ఉన్న మట్టిరోడ్డు



నేడు సుందరంగా మారిన తారురోడ్డు

కనగానపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): 'కలలోనైనా కనగలేదు మా గ్రామా నికి తారురోడ్డు వస్తుందని, రోడ్డుకు నిధులు మంజూరైనా ఇంత త్వరగా రోడ్డు పూర్తిచేస్తారని అనుకోలేదు.' ఇవి నెమలివరం గ్రామస్థుల్లో ప్రతి ఒక్కరి నుంచి వస్తున్న మాటలు. మండల పరిధిలోని నెమలివరం గ్రామం మండల కేంద్రమైన కనగానపల్లికి 13 కిలోమీటర్లు దూరంలో ఉంది. కానీ తారు రోడ్డు సౌకర్యం లేదు. ఈ ప్రభుత్వం నెమలివరం గ్రామా నికి తారు నిర్మాణం కోసం ఉపాధి నిధులు రూ. 2కోట్లు మంజూరు చేసింది. బాలే పాళ్యం గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల మేర నెమలివరం వరకు తారు రోడ్డు వేశారు. గుంతల మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడ్డ ప్రజలు తారు రోడ్డు ఏర్పాటుతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

మండలంలోని బాలేపాళ్యం నుంచి నెమలివరం గ్రామానికి వేసిన తారురోడ్డును ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం ప్రారంభించను న్నట్లు టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు తారురోడ్డు ప్రారంభిస్తారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచులు హజరై విజయవంతం చేయాలన్నారు.

ఘనంగా ముగిసిన దుర్గాంబ జాతర

వెంకటాపురంలో విందు ఏర్పాటు చేసిన పరిటాల సునీత, శ్రీరామ్... భారీగా తరలివచ్చిన జనం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రామగిరి, మే 18(ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా జరుగుతున్న దుర్గాంబ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఐదు రోజులు భక్తిశ్రద్ధలతో దుర్గాంబ జాతర ఉత్సవాలను వెంకటాపురం, నసనకోట, గంగంపల్లి గ్రామాల ప్రజలు నిర్వహించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ, కుటుంబ సభ్యులు మూడు గ్రామాల ప్రజలను కలుపుకుని ఉత్సవాలను దిగ్విజయంగా ముగించారు. ఆదివారం తెల్లవారు జామున 4 గంటలకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చివరి రోజు పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు రావడంతో ఈ మూడు గ్రామాలు కిక్కిరిసిపోయాయి. వెంకటాపురంలో భారీస్థాయిలో విందును ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, సిద్దార్థ స్వయంగా వడ్డించారు. కర్ణాటక మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. 800 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆలయ విశిష్టతను తెలిపే విధంగా ఈ జాతర మహోత్సవాలు జరిగాయని ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ అన్నారు. ఇక నుంచి జాతర మహోత్సవాలు తరచుగా జరుగుతుంటాయని వారు పేర్కొన్నారు. ఆదివారం చివరి రోజున గ్రామ పొలి కార్యక్రమంతో వేడుకలు ముగిశాయి. 64 సంవత్సరాల తరువాత జాతర జరుపుకుంటుండడంతో ప్రతి ఒక్కరు బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులను పిలిపించుకున్నారు. ముగింపు ఉత్సవాల్లో హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి పాల్గొన్నారు.



విందును పరిశీలిస్తున్న పరిటాల సునీత

సైనికులకు బాసటగా నిలుద్దాం

● తిరంగా ర్యాలీలో నాయకుల పిలుపు



నార్పలలో ర్యాలీలో పాల్గొన్న ఆలం వెంకట నరసానాయుడు

నార్పల, మే 18(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెడుతున్న సైనికులకు అందరం బాసటగా నిలుద్దామని టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నార్పల మండల కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎర్రినాగప్ప, తెలుగు యువత నాయకులు చంద్రబాబు, క్లస్టర్ ఇన్చార్జి పీఎల్ లక్ష్మీనారాయణ, నాయకులు నరసాపురం సత్తి, నడిమిదొడ్డి నాగార్జున నడిమింటి రాము, నల్లపురెడ్డిపల్లి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

●శింగనమల: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డేసి నిలి చిన సైనికులకు బాసటగా నిలుద్దామని బీజేపీ, జేనసేన పార్టీ మండల అధ్యక్షులు బొమ్మన ఓబిరెడ్డి, తోట ఓబిలేసు పిలుపునిచ్చారు. శింగనమ లలో ఆదివారం తిరంగా ర్యాలీని రామస్వామి దేవాలయం నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద వరకు నిర్వహించారు. గ్రామస్థులు పవన్‌కు మార్, రాం భూపాల్‌రెడ్డి అంజన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నుంచి హనుమప్ప సస్పెన్షన్

● సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి

అనంతపురం విద్య, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ప్రాథమిక సభ్యత్వం నుంచి హనుమప్పను సస్పెండ్ చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్న హనుమప్పను రెండేళ్ల పాటు ప్రాథమిక సభ్యత్వం నుంచి రాష్ట్ర సంఘం సస్పెండ్ చేసిందన్నారు. రాష్ట్ర కమిటీలో ఏర్పడిన రెండు ఖాళీలను గత ఏడాది అక్టోబరు 14, 15 తేదీల్లో రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సబ్ కమిటీ, కార్యవర్గ సమావేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా భర్తీ చేశారన్నారు. అయితే అప్రజాస్వామ్యంగా వ్యవహరించారంటూ హనుమప్ప చేసిన ప్రకటన రాష్ట్ర కమిటీకి ఆగ్రహం తెప్పించిందన్నారు. ఆయన వైఖరిపై సంజాయిషీ కోరుతూ 163/2024 లేఖ ద్వారా నోటీసు ఇచ్చినప్పటికీ సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. దీంతో ఆయనను రెండేళ్లపాటు సస్పెండ్ చేసినట్లు రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి స్పష్టం చేశారు.

ప్రమోషన్లలో వర్గీకరణ అమలు చేయాలి

● ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి శంకర్

అనంతపురం సెంట్రల్, మే 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల ప్రమోషన్లలలో ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోన ఆ సంఘం కార్యాలయంలో ఆదివారంనిర్వహించిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ, సహకారాలతో వర్గీకరణ సాధ్యమైందన్నారు. విభాగాల వారీగా అమలు చేయ డంలో జాప్యం నెలకొందని, రాష్ట్రస్థాయి అధికారులు స్పందించి ఉత్త ర్వులు జారీచేయాల్సిన అవసరముందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ఈ - మెయిల్‌ద్వారా లేఖ పంపామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నాగేంద్ర, శ్రీనివాసులు, నాగభూషణ, నారాయణస్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందామంటూ ర్యాలీ



రామగిరి, మే 18(ఆంధ్రజ్యోతి):ఆర్డీటీని కాపాడుకుందా మంటూ మండలంలోని పేరూరులో గ్రామస్థులందరు కలిసి ఆది వారం ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీకి యథావిధిగా నిధులు వచ్చేలా చూడాలని కోరారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీ చేస్తున్న స్థానికులు

కణేకల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో మండల కేంద్రంలో ప్రజలు ఆదివారం తిరంగా ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని చేతబూని స్థానిక చిక్కణ్ణేశ్వర ఆలయం నుంచి దిగువ గేరి వరకు ర్యాలీ నిర్వహించారు. భారత్‌మాతాకి జై, జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో పవన్‌కుమార్‌తో పాటు స్థానికులు తిప్పేస్వామి, రవిచంద్ర, వేలూరు రవి, అనిల్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

గుంతకల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ మినీ మహానాడును నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పార్టీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక బలిజ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 11 గంటలకు మినీ మహానాడును నిర్వహించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరై పార్టీ కార్యాచరణపై తీర్మానాలు చేస్తారన్నారు. అదే రోజు సాయంత్రం పట్టణంలో తిరంగ యాత్రను నిర్వహించనున్నట్లు చెప్పారు. అందులోనూ అందరూ పాల్గొనాలని కోరారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సమావేశంలో నాయకులు పాల మల్లికార్జున, మాత్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.

● రాయదుర్గం: పట్టణంలోని సీతారామాంజనేయస్వామి కల్యాణ మంటపంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ మినీ మహానాడును నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు పట్టణంలోని టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధసంఘాల సభ్యులు పాల్గొనాలని అన్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మురళీ నాయక్‌కు ఘన నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

గుంతకల్లుటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వీర జవాన్ మురళీ నాయక్‌కు మండలంలోని గుండాల తండా గ్రామంలో ప్రజలు ఆదివారం సాయంత్రం ఘన నివాళులర్పించారు. గుంతకల్లు పిరమిడ్ వాకర్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎక్స్ ఆర్మీమెన్ మోహన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌పై జరిగిన యుద్ధంలో మురళీ నాయక్ చూపిన ధైర్య సాహసాలను కొనియాడారు. గ్రామ పెద్దలు గోపాల్‌నాయక్, గణపతినాయక్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సరస్వతి

పెద్దవడుగూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ గ్యాస్ కంపెనీ ఏజెన్సీ నిర్వహణకు తమకు అన్ని అనుమతులు ఉన్నా వైసీపీ మండల నాయకుడు అడ్డంకులు సృష్టిస్తున్నాడని మండలకేంద్రానికి చెందిన సరస్వతి వాపోయారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2012లో లాటరీపద్ధతి ద్వారా గ్యాస్ ఏజెన్సీ తనకు దక్కిందని, అయితే నిర్వహణ బాధ్యతలను వైసీపీ నాయకుడు సూర్యప్రభాకర్‌రెడ్డి అలియాస్ బాబుకు అప్పజెప్పామని అన్నారు. కాగా ఆయన నిర్వహణ తీరుతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనివల్ల ఆ నిర్వహణ బాధ్యతలు తిరిగి అప్పగించాలని అడుగుతున్నామన్నారు. నెలల తరబడి అడుగుతున్నా.. ఆయన కాలయాపన చేయడంతో పాటు మమ్మల్ని చంపుతామని బెదిరిస్తున్నాడని వాపోయారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వహణకు సంబంధించిన అన్ని ఆధారాలు సంబంధిత అధికారులకు, పోలీసులకు ఇచ్చినా నేటికీ అతడిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు తగు న్యాయం చేయాలని ఆమె కోరారు.

ఇన్ఫినిటీ ట్రస్ట్ సేవలపై గవర్నర్ అభినందనలు



ట్రస్టు సేవలను గవర్నర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని (ఫైల్)

కళ్యాణదుర్గం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు సేవల్ని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అభినందించినట్లు పట్టణానికి చెందిన ఆ ట్రస్టు చైర్మన్ మాస్టర్ బద్దేనాయక్ ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇంటికి గత శనివారం గవర్నర్ వచ్చి నూతన వధూవరులైన శ్రీచరిత, రాహుల్ ఆదిత్యను ఆశీర్వదించారన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆయనకు ఇన్ఫినిటీ ట్రస్టు ద్వారా తాను అందిస్తున్న సేవల్ని వివరించారన్నారు. ఇందుకు గవర్నర్ తనను ప్రశంసిస్తూ అభినందించినట్లు బద్దేనాయక్ పేర్కొన్నారు.

టౌన్ రైడర్ యాప్‌ను రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): టౌన్ రైడర్ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ, ఆటోయూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలో సుమారు 5వేల మంది ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇప్పుడు కొత్త నిబంధనల పేరుతో ప్రభుత్వాలు ఆటోరంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుండడం దారుణమన్నారు. టౌన్ రైడర్ ద్వారా ఆటో కార్మికుల పొట్టకొట్టేందుకు చూస్తున్నారన్నారు. టౌన్ రైడర్ సంస్థ సొంతంగా ఆటోలు తీసుకొచ్చి వారే బాడుగులకు నడిపితే.. ఇక ఆటోల మీద ఆధారపడి జీవించే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే టౌన్ రైడర్ యాప్‌ను రద్దు చేయాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం టౌన్ రైడర్ పోస్టర్లను దహనం చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు వీరేష్, హరి, మోహన్, ఎస్‌కేఎం బాషా, రాజేష్, వెంకీ, బాబీ, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు

అశ్వవాహనంపై ఊరేగిన నారసింహుడు

● బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెన్నహోబిలం ఆలయంలో ప్రత్యేక పూజలు

ఉరవకొండ, మే18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అశ్వవాహనంపై నారసింహుడు విహరించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని మేళతాళాలతో తీసుకువచ్చి అశ్వ వాహనంపై కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమానికి అంగదాల నారాయణస్వామి కుటుంబసభ్యులు దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజావరోహణం, శయనోత్సవం నిర్వహించనున్నారు.



అశ్వవాహనంపై పెన్నహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి

ప్రసన్న వేంకటేశ్వరుడికి అశ్వవాహన సేవ

రాయదుర్గం: పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశ్వవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత స్వామి వారి ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ఊరేగింపు మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, పాతబస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా సాగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రెడ్డి, ఆరెకటిక, నాయీబ్రాహ్మణ, ఈడిగ సంఘాల ఆధ్వర్యంలో అశ్వవాహనోత్సవాన్ని నిర్వహించారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

బస్సు సర్వీసును అప్పుడే నిలిపేశారు..

● నేమకల్లుకు ఐదునెలలు కూడా కొనసాగించని ఆర్టీసీ అధికారులు

● సీఎం ఆదేశాలు బేఖాతర్..

బొమ్మనహాళ్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లులో గత ఏడాది నవంబరు 30వ తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించి ఈ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ప్రముఖ ఆంజనేయస్వామి ఆలయం ఉన్న ఈ గ్రామానికి బస్సు సౌకర్యం లేదని గ్రామస్థులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన బస్సు సౌకర్యం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఆ తర్వాత వెంటనే నేమకల్లుకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడపాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు గత ఏడాది డిసెంబరు 6వ తేదీన గ్రామం నుంచి రాయదుర్గానికి బస్సు సర్వీసును ప్రారంభించారు. అయితే ఆ సర్వీసును పట్టుమని ఐదు నెలలు కూడా కొనసాగించలేదు. నెల క్రితం బస్సు సర్వీసును రద్దు చేశారు. దీంతో సీఎం హామీని అప్పుడే నీరుగార్చారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఆర్టీసీ యాజమాన్యం బస్సును రద్దు చేయడంతో ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. చేసేదిలేక ప్రతి మంగళవారం, శనివారం ఆలయానికి ఆటోల్లో వేళాడుతూ ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తూ వస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రాయదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడారు. రద్దు చేసిన బస్సు సర్వీసు పునరుద్ధరిస్తామని చెప్పినట్లు పూల నాగరాజు తెలిపారు.



నేమకల్లులో బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న దృశ్యం (ఫైల్)

గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం

● తీరిన పశువుల దాహార్తి

పెద్దవడుగూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇదివరకు వేసవి వస్తే చాలు మూగజీవాలు దాహార్తి కోసం వంకలు, వాగులు వెతకాల్సి వస్తోంది. అయితే ఇప్పుడు ఆ అవసరం లేదు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద మండల వ్యాప్తంగా గ్రామాల్లో నీటితొట్టెలు నిర్మించి నీటి వసతి కల్పించింది. దీంతో జీవాలకు, పశువులకు నీటి సమస్య తీరింది. మండలంలోని 25 గ్రామ పంచాయతీ గ్రామాల్లో నూతనంగా 30 నీటితొట్టెల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకు 15 తొట్టెల నిర్మాణం పూర్తయింది. ముఖ్యంగా వేసవివస్తే చాలు భీమునిపల్లి, రావులుడికి, రామరాజుపల్లి, కండ్లగూడూరు గ్రామాల్లో మూగజీవాలు దాహార్తి కోసం కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఆయా గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించారు. దీంతో మూగజీవాల దాహార్తి తీరినట్లు అయింది.



రావులుడికిలోని తొట్టెలో దాహార్తి తీర్చుకుంటున్న జీవాలు

పలుచోట్ల కొవ్వొత్తులతో ర్యాలీ..

● ఎయిడ్స్‌తో మృతిచెందిన వారికి నివాళి



రాయదుర్గంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కళ్యాణదుర్గంలో రిడ్స్ సంస్థ సభ్యుల ర్యాలీ..

రాయదుర్గం, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వాసుపత్రి సిబ్బంది ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారకదినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రధానవీధుల గుండా కొనసాగింది. ప్రపంచవ్యాప్తంగా ఎయిడ్స్‌తో మరణించిన వారికి నివాళులు అర్పిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించినట్లు వైద్యాధికారి మోహన్‌సాయి తెలిపారు.

గుత్తి: పట్టణంలోని హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వారు అంతర్జాతీయ క్యాండిల్స్ లైట్ స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌తో మృతి చెందిన వారికి స్థానిక సంస్థ కార్యాలయంలోనే కొవ్వొత్తులు వెలగించి నివాళులర్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి: అంతర్జాతీయ కొవ్వొత్తుల స్మారకదినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అశోక్‌పిల్లర్ వరకు వైద్య సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ శివశంకర్‌రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని ఎయిడ్స్ నియంత్రణ స్వచ్ఛంద సంస్థ రిడ్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ మహేష్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్‌తో మరణించిన వారికి నివాళులర్పిస్తూ ఈ ర్యాలీ చేసినట్లు చెప్పారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యుడు రాజేష్ కుమార్, టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ప్రగతి మైత్రి మహిళా సంఘం వారు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌తో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కొవ్వొత్తులను వెలగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యుడు అశ్వక్ హుసేన్, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రసాద్, డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ పీరానాయక్, ఆ సంఘం మేనేజర్ రమేష్, ఏఎన్ఎం నజుమున్నీసా, సభ్యులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గంరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం ములకనూరు తిమ్మరాయప్ప కొండ గ్రామ శివారులో గల పేకాట స్థావరంపై ఆదివారం తెల్లవారుజామున పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో పేకాటాడుతు న్న 46 మందిని అరెస్టు చేశారు. అనంత రం వారి వద్ద నుంచి రూ. 2,32,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అరెస్టయిన వారిపై కేసు నమోదు చేశారు. రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడు లు చేసినట్లు కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర, ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

నేడు కంటి వైద్యశిబిరం

ఉరవకొండ,మే18(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సుశీల నేత్రాలయం సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. శిబిరానికి హాజరయ్యేవారు ఎన్టీఆర్ వైద్యసేవ ఆరోగ్య శ్రీ కార్డును తీసుకురావాలన్నారు. శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి కర్నూలులోని సుశీల నేత్రాలయంలో చికిత్స చేయించనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు హుండీ ఆదాయం లెక్కింపు

ఉరవకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గల హుండీల కానుకల్ని మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రమేష్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల సం దర్భంగా భక్తు లు స్వామి వారికి హుండీల ద్వారా సమర్పించిన కానుకల్ని లెక్కించనున్నట్లు చెప్పారు. దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఉద యం 8గంటలకు లెక్కింపు చేపడతామన్నారు. పాల్గొనే భక్తు లు తెల్లపంచె, కండువా మాత్రమే ధరించి హాజరు కావాలని సూచించారు.

నీటి ట్యాంక్ పైపుల చోరీ

గుత్తి, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఎస్‌లో గల మెయిన్ బజార్‌లో ప్రజా సౌకర్యార్థం ఏర్పాటు చేసి స్పాట్ డెలివరీ ట్యాంక్‌కు అమర్చిన నీటి కొళాయిల పైపులను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీ చేశారు. నీళ్ల పట్టుకునేందుకు ఆదివారం ఉదయం స్థానిక ప్రజలు ట్యాంక్ వద్దకు వెళ్లగా ట్యాంక్‌కు ఉన్నపైపులు చోరీకి గురయ్యాయని గుర్తించారు. దీంతో విషయాన్ని మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు.

దిష్టిబొమ్మల్లా..

● రైతుసేవా కేంద్రాల్లో వృథాగా కియోస్క్ యంత్రాలు

● లక్షల రూపాయల ప్రజాధనం వృథా

ఉరవకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ సేవలు సులభంగా అందించడానికంటూ గత వైసీపీ ప్రభుత్వం అప్పటి రైతుభరోసా కేంద్రాల్లో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాలు ప్రస్తుతం ఉపయోగంలో లేక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అవి వినియోగంలో లేకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం అయింది. అన్నదాతలు స్వయంగా తమకు అవసరమైన రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కియోస్కో యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చని, నేరుగా రైతు ల ఇంటికే వాటిని సరఫరా చేస్తామని అధికారులు అప్పట్లో హడావుడి చేశా రు. ఈ క్రమంలో కొంతకాలం సేవలు కూడా అందించారు. అనంతరం వాటికి ఇంటర్నెట్ సౌకర్యం సరిగ్గా లేక వినియోగించపోవడంతో మూలనపడ్డాయి.

యాప్‌ల రాకతో..

వ్యవసాయశాఖకు సంబంధించి యాప్‌లు ఫోన్‌లో అందుబాటులోకి రావడంతో ఈ యంత్రాలను సరిగ్గా వినియోగించడం లేదు. సుమారు ఒక్కొక్క యంత్రం రూ.75 నుంచి రూ.90వేల వరకూ వెచ్చించి కొనుగోలు చేశారు. ఉరవకొండ వ్యవసాయ డివిజన్‌లోని వజ్రకరూరు, విడపనకల్లు, ఉరవకొండ, గుంతకల్లుతో పాటు నియోజకవర్గంలోని బెళుగుప్ప, కూడేరు మండలాల్లో 85 ఆర్ఎస్‌కేలు ఉండగా వాటన్నింటిలోనే కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల్లోనూ ఈ పరికరం కనిపిస్తుంది. కాగా ప్రస్తుతం గ్రామస్థాయిలో ఇంటర్నెట్ సౌకర్యం అందరికీ అందుబాటులో ఉండడం వలన ఆ యంత్రాలు ఎవరికీ ఉపయోగపడడం లేదు. సెల్‌ఫోన్ ద్వారానే సులభతరంగా సేవలు పొందుతున్నారు. దీంతో వీఏఏ, ఎంపీఈవోలు ఎరువులు, పురుగు మం దులు, విత్తనాలు, యంత్రాలు, యంత్ర పరికరాలు ఈ పంట నమోదు తదితర వాటన్నింటినీ ఫోన్‌లోనే నమోదు చేస్తున్నారు. ఈ విషయంపై ఏడీఏ పద్మజను వివరణ కోరగా ప్రస్తుతం అన్నీ ఫోన్లలో లేక, కంప్యూటర్‌లలో సిబ్బంది నమోదు చేస్తున్నారని, అవసరమైన పుడు ఆ కియోస్క్ యంత్రాలను వినియోగిస్తామని అన్నారు.



ఉరవకొండలోని రైతు సేవాకేంద్రంలో నిరుపయోగంగా ఉన్న పరికరం

కూలిపోతేగానీ పట్టించుకోరా..?

● శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభం

● పట్టించుకోని సంబంధితాధికారులు

కూడేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. స్తంభం కింది భాగంలో పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. దీంతో అది అప్పుడో ఇప్పుడో కూలేందుకు సిద్ధంగా ఉంది. దీని వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విషయం తెలిసినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు. ఆ స్తంభం స్థానంలో అయితే నూతన స్తంభం ఏర్పాటు చేశారు. కానీ విద్యుత్ లైన్ మార్చలేదు. బలమైన గాలులు వస్తే దెబ్బతిన్న స్తంభం కూలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే ప్రాణ నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి దెబ్బతిన్న స్తంభాన్ని తొలగించి.. విద్యుత్‌లైన్‌ను కొత్తస్తంభానికి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దెబ్బతిన్న స్తంభం పక్కన మరొకటి ఏర్పాటు చేసిన దృశ్యం



కింద భాగాన దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

ముళ్లపొదలతో భయం.. భయం..

●తెనగల్లు రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

● భయాందోళ చెందుతున్న వాహనదారులు



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా ఉన్న కంపచెట్లు

కుందుర్పి, మే 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనగల్లు నుంచి కరిగానిపల్లి, అపిలేపల్లి రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెద్దఎత్తున పెరిగిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణించేటప్పుడు కంపలు తగులుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అదీకాకుండా కంపచెట్లు ఇరువైపులా ఏపుగా ఉండడంతో ఒంటరిగా ప్రయాణించాలంటే భయాందోళనలు కలుగుతున్నాయని అంటున్నారు. దాదాపు రెండేళ్ల నుంచి ఇలాగే ఉన్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా ఉన్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ముళ్లకంపలు తొలగించాలని వారు కోరుతున్నారు.

పెట్టుబడి సాయం అందజేయాలి: సీపీఎం

పామిడి, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రూ. 20వేలు పెట్టుబడి సాయం అందజేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధరలు కల్పించాలన్నారు. నూతన కౌలు చట్టం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలన్నారు. మే 20న చేపట్టే నిరసన కార్యక్రమాల్లో భవన నిర్మాణ కార్మికులు, కౌలు రైతులు, కార్మికులు తప్పక హాజరవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు అనిమిరెడ్డి,చంద్రమోహన్‌రెడ్డి, ముత్యాలు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో వాగ్వాదం

తాడిపత్రి, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందలపాడు సీఎస్ఐ చర్చిలో ఆదివారం పాస్టర్‌తో చర్చి సభ్యులు వాగ్వాదానికి దిగారు. గత కొంతకాలంగా పాతకమిటీనే నియమిస్తున్నారని, ఎన్నిరోజులు ఈ కమిటీని నియమిస్తారని, కొత్తవారికి అవకాశం ఇవ్వరా అని పలువురు సభ్యులు వాగ్వాదానికి దిగారు. చర్చి నిబంధనల ప్రకారం కమిటీని ఎన్నుకోవాలని తెలియదా అని పాస్టర్‌పై మండిపడ్డారు. చాలా ఏళ్ల నుంచి పాతకమిటీనే నియమిస్తే కొత్తవారికి అవకాశం ఎప్పుడు ఇవ్వాలని వాదించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. సీఐ సాయిప్రసాద్ ఇరువర్గాలతో మాట్లాడి పద్ధతి ప్రకారం నడుచుకోవాలని సూచించారు.

అమ్మవార్ల ఆలయాల్లో పూజలు

యల్లనూరు, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. యల్లనూరు, కొడవండ్లపల్లి గ్రామాల్లోని పెద్దమ్మ ఆలయాల్లో, చిలమకూరు యల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు.

జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

బొమ్మనహాళ్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం జనసేన కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. మండల కన్వీనర్ శివరాజ్ మాట్లాడుతూ మండలంలో దాదాపు 500 మందికి సభ్యత్వ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సికిందర్, చిదానంద, జ్ఞానమూర్తి, ఆనంద్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎర్రిస్వామి

ఉరవకొండ,మే18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గం అధ్యక్షుడిగా చాపిరి ఎర్రిస్వామి ఎన్నికయ్యారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఆదివారం ఏపీజీఈఏ నియోజకవర్గ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికలు చేపట్టారు. కార్యదర్శిగా వశకేరి మహేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామ్మోహన్, కోశాధికారిగా భరత్, ఉపాధ్యక్షులుగా తిరుపాల్ నాయక్, గోపాల్, నాగేంద్రబాబు, లోకేష్, బాలావెంకటేష్, సహాయకార్యదర్శులుగా చౌడప్ప, నూర్‌మహ్మద్, మహబూబ్‌బీ, మల్లికార్జున, దుర్గాప్రసాద్, పరశురాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, సాంబశివమ్మ, తిమ్మరాజు, వరప్రసాద్, పాల్గొన్నారు.



ఎన్నికైన కమిటీ సభ్యులు